క్లుప్తంగా

సాగర్‌రోడ్డుపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

యాచారం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు సాగర్‌రోడ్డుపై గునుగల్–ఆగాపల్లి గ్రామాల మధ్య రాస్తారోకో నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి అమలుచేయాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీకాంత్, మహేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో గ్రామ దేవతలను అభిషేకించండి



కలశ కుండలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

తలకొండపల్లి: కృష్ణా జలాలతో గ్రామ దేవతలను అభిషేకించాలని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. పాలమూర్– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ నార్లాపూర్ పంప్‌హౌజ్ వెటరన్‌ను ప్రారంభించారని తెలిపారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లో సాగు భూములు సస్యశ్యామలమవుతాయని పేర్కొన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కృష్ణా జలాలతో నింపిన కలశ కుండలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాసురెడ్డి, ఎంపీపీ తిర్మణి నిర్మల, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, సర్పంచ్ లలిత, జ్యోతయ్య, కార్యదర్శి రాఘవేందర్, జానయ్య, వెంకట్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమని ఆమనగల్లు మండలం శెట్టిపల్లి సర్పంచ్ గోదాదేవి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల బిల్లు చరిత్రాత్మకమని అన్నారు. ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు తీసుకొచ్చిందని ఆమె అన్నారు.

బీజేపీ ఘనతే...

మంచాల: దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కేంద్రంలో బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు జయశ్రీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలో అనేక నూతన ఆవిష్కరణలకు ప్రధాని శ్రీకారం చుట్టారని తెలిపారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, మంచాల మండల ఇన్‌చార్జి జంగయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, పీఏసీయస్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆమనగల్లులో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆమనగల్లు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ కార్మికసంఘం నాయకులు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కార్మికులు ఆందోళనకు దిగారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

శిథిల భవనాలు

- నిరుపయోగంగా సిబ్బంది క్వార్టర్స్
- నిర్వహణ లేక ప్రజాధనం వృథా
- ఏళ్లు గడుస్తున్నా.. మరమ్మతులకు నోచుకోని వైనం
- వైద్య సేవలు అందక రోగుల అవస్థలు



మొయినాబాద్ పీహెచ్‌సీ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్స్

మొయినాబాద్: స్థానికంగా నివాసముంటూ 24 గంటలు వైద్య సేవలందించేందుకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సిబ్బందికి శిథిలావస్థకు చేరుకున్న నివాస క్వార్టర్స్ నిరాశే కలిగిస్తున్నాయి. దీంతో వైద్య సిబ్బంది ఇక్కడ నివాసం ఉండడం లేదు. నిర్మించినప్పటి నుంచి వినియోగించకపోవడంతో పాటు వాటి నిర్వహణను పట్టించుకోపోవడంతో కూలిపోయే దుస్థితికి చేరాయి. ఈ కారణంగా అత్యవసర సమయాల్లో వైద్య సేవలు సత్వరం అందక రోగులు అవస్థలు పడుతున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అక్కడే నివాసం ఉండాలనే లక్ష్యంతో ఇరవై ఏళ్ల క్రితం ఐదు క్వార్టర్స్ నిర్మించారు. ఉండేందుకు అన్ని వసతులు కూడా కల్పించారు. కానీ ఉద్యోగులు ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అప్పటి నుంచి వైద్యాధికారులు వాటి నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి.

కలెక్టర్ చొరవతో..

నిరుపయోగంగా క్వార్టర్స్‌ను ఆరేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ వాణిప్రసాద్ సందర్శించారు. ఒక భవనానికి మరమ్మతులు చేసి గర్భిణుల నిరీక్షణ కోసం వినియోగించాలని నిధులు మంజూరు చేశారు. దీంతో ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. మరో భవనంలో మూడేళ్ల క్రితం వరకు ఆయుర్వేద ఆస్పత్రి కొనసాగింది. అది కూడా శిథిలావస్థకు చేరడంతో అక్కడి నుంచి తరలించారు.

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం

మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ఒక క్వార్టర్స్‌ను కూల్చివేసి రెండు వాటర్ ట్యాంక్‌లను నిర్మించారు. మరొక క్వార్టర్స్ ముందు భాగంలో గ్రామ పంచాయతీ వన నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ఇక మిగిలిన రెండు క్వార్టర్స్ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ రెండు భవనాలకైనా మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తే వైద్య సిబ్బంది ఉండేందుకు ఉపయోగపడతాయని స్థానికులు చెబుతున్నారు. నివాసముండేందుకు క్వార్టర్స్ లేవనే నెపంతో వైద్య సిబ్బంది పట్టణం నుంచి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టం వచ్చినప్పుడు ఆస్పత్రికి వస్తున్నారని, దీంతో రోగులకు సరైన సమయంలో వైద్యం అందడం లేదని వాపోతున్నారు.

భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



ప్రొసీడింగ్స్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణ ప్రభుత్వం కులవృత్తుల బలోపేతానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కయంజాల్ కురుమ సంఘం నాయకుడు డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి కురమ సంఘం భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రూ. 10 లక్షలు మంజూరు చేశారు. దానికి సంబంధించిన ఉత్తర్వులను కురుమ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాబయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింహాతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాలశీతలీకరణ కేంద్రంలో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న సిబ్బంది

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశుడికి పాల కేంద్రం అధికారులు, భక్తులు, రైతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధిక, ఉప సర్పంచ్ రామకృష్ణ, సిబ్బంది చేగూరి మహేశ్, రమేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మురుగు కాలువ పనులు ప్రారంభిస్తున్న ఆచారి, రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో రూ.11 లక్షలతో చేపట్టే మురుగు కాలువ నిర్మాణ పనులను గురువారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, వార్డు కౌన్సిలర్ దివ్య, నాయకులు శ్రీకాంత్‌సింగ్, నర్సింహ, యాదమ్మ, కోటేశ్, శ్రీశైలం, బాలయ్య తదితరులు ఉన్నారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు వద్ద గురువారం వినాయక నిమజ్జనం ఏర్పాట్లను శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. చెరువు వద్ద చేపట్టిన చర్యల గురించి ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఎస్‌ఐ బాల్‌రాంతో చర్చించారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని ఏసీపీ సూచించారు.

సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే.. దానిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లను, అంగన్‌వాడీలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గర్భిణులకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కిషన్, బుగ్గరాములు, కృష్ణ, చందునాయక్, అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, బేబి, గీత, సంతోష, అండాలు, పద్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్ తదితరులు

యాచారం: రాష్ట్ర మత్స్య కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలు గ్రామాల మత్స్య పారిశ్రామిక సొసైటీలకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. మండలంలోని గుర్తింపు పొందిన 15 మత్స్యపారిశ్రామిక సొసైటీలకు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 4 లక్షల 90 వేల చేప పిల్లలను పంపిణీ చేశారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సొసైటీలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. పలు గ్రామాల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



లక్ష్మికి చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన లక్ష్మి అనే విద్యార్థిని ఉన్నత చదువులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి చేయూత నందించారు. ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కార్యకర్తల ద్వారా రాఘవేందర్‌రెడ్డి తెలుసుకున్నారు. గురువారం లక్ష్మి మొదటి సంవత్సరం కళాశాల ఫీజుకు సంబంధించి రూ.35 వేలు చెక్కును రాఘవేందర్‌రెడ్డి అందజేశారు. రాఘవేందర్‌రెడ్డికి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపింది.

తలకొండపల్లి: కల్వకుర్తి మండలం మార్చాలకు చెందిన నితీశ్‌గౌడ్, యోగిలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడతో కళాశాల ఫీజులు కట్టలేక సమతమవుతున్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఉప్పల చారిటబుల్ ట్రస్టు కార్యవర్గ సభ్యులు, డాక్టర్ అఖిల్ స్థానిక నాయకుల ద్వారా విషయాన్ని తెలుసుకున్నాడు. గురువారం ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత



మురుగుకాలువ పనులను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు, పోలెపల్లి ఎంపీటీసీ కుమార్ అన్నారు. ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులతో చేపట్టే మురుగు కాలువ నిర్మాణ పనులు సర్పంచ్ ప్రేమలతతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోచాలు, స్థానిక నాయకులు యాదయ్య, తిరుపతయ్య, రాజు, సత్యం, రామకృష్ణ, యాదయ్య, సైకిలాబ్, మల్లయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

- మళ్లీ బీఆర్‌ఎస్‌కే అధికారం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: సీఎం కేసీఆర్ పాలనకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ముద్విన్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో తిరిగి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్ నాయకులు రాజేందర్‌యాదవ్, శ్రీనివాస్, సాయిలు, చంద్రమౌళి, జంగయ్య తదితరులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నం: తుర్కగూడలో కొలువైన వినాయకుడు

గ్రామాల్లో వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. తాము తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా జరగాలంటూ వినాయకుడికి పూజలు చేస్తారు. చవితి వేడుకల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

రైతు కుటుంబాలకు అండగా...

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సుర్మాయిగూడ గ్రామానికి చెందిన సంఘం సభ్యుడు యాదయ్య జూన్ 19వ తేదీన మృతి చెందడంతో సంఘం తరపున మృతుడి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుధాకర్‌రెడ్డి, సుజాత, ఎంపీటీసీ సాయిగౌడ్, మేనేజర్ ఐలేశ్‌యాదవ్, నాయకులు సత్యనారాయణగౌడ్, జంగమయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీసంఘం అధ్యక్షుడు బాలకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి శివలింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, చేనేత సంఘం అధ్యక్షుడు శ్రీను, నాయకులు అప్పం శ్రీనివాస్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం

- 'గ్యారంటీ'తో పూర్వ వైభవం ఖాయం
- పార్టీ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి
- వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరిక



రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు తదితరులు

తలకొండపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని ఏఐసీసీ నేత సోనియాగాంధీకి బహుమతిగా ఇవ్వాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తుక్కుగూడ సభలో ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలతో పార్టీకి పూర్వ వైభవం రాబోతోందని జోస్యం చెప్పారు. మండలంలోని చీపునుంతం, వెంకటాపూర్, దేవుని పడకల్, గడ్డమీదితండా, పడకల్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబంలోని మహిళకు రూ.2,500 నగదు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం తదితర పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన నాయకుడు రవికాంత్‌గౌడ్, సీనియర్ నాయకులు మహేశ్, వెంకటయ్య, నరేశ్, తిరుపతి, శ్రీశైలంగౌడ్, గోపి, శివ కుమార్, నవీన్, సాయినాథ్, నాగరాజు, జాంగీర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.1,00,116 (లక్ష నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం జెడ్పీటీసీ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ సక్రి, రాజా, మహేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేసీఆర్

- బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన ప్రజలు
- రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యం
- బీజేపీ సీనియర్ నాయకుడు ఆచారి



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఆచారి

కడ్తాల్: సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని బీజేపీ సీనియర్ నాయకుడు టి.ఆచారి విమర్శించారు. గురువారం 'పల్లెపల్లెన బీజేపీ– ఇంటి ఇంటికి ఆచారి' కార్యక్రమాన్ని మండలంలోని న్యామతాపూర్, మక్తమాధారం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లుగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని జోస్యం చెప్పారు.

ఆర్టీసీ బస్సులు రద్దు చేయడం తగదు

మక్తమాధారం గ్రామానికి ఆర్టీసీ బస్సులు సకాలంలో రావడం లేదని, తరుచూ నిలిపి వేస్తుండటంతో కడ్తాల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని, దీనివల్ల తరగతులు కోల్పోతున్నామని విద్యార్థులు ఆచారి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని, ప్రభుత్వం తరుచూ మీటింగ్‌ల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను రద్దు చేయడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు బ్రహ్మచారి, యాదగిరి, వెంకటయ్య, బాల్‌రాజు, శంకరయ్య, సాయిలాల్, రాందాస్, నర్సింహ, వెంకటేశ్, రెడ్యా, నవీన్, శేఖర్, శంకరయ్య ఉన్నారు.